

చంద్రఘంటా రూపంలో అమ్మవారు

ధర్మపురి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శనివారం చంద్రఘంటా రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో మూడో రోజు అమ్మవారికి పూజలు నిర్వహించారు.



కొండగట్టులో భక్తుల రద్దీ

కొండగట్టు(చొప్పదండి): అంజన్న ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. ఆలయంలో కొలువుదీరి.. అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
32.0/24.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఎండ వేడిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రైతులు ప్రతిపక్షాల ట్రాప్‌లో పడొద్దు



మాట్లాడుతున్న అడ్లూరి

జగిత్యాలటౌన్: రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, రూ.రెండు లక్షల వరకు రుణాలు మాఫీ చేశామని, సాంకేతిక కారణాలతో మాఫీకాని రైతుల వివరాలు సేకరిస్తున్నామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్షాల ట్రాప్‌లో పడి రైతులెవరూ రోడ్డెక్కవద్దని సూచించారు. జిల్లాలో 65వేలకుపైగా రైతురుణాలు మాఫీ చేశామని, నాలుగు వేలకుపైగా రైతులకు త్వరలోనే మాఫీ చేస్తామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఐదేళ్లలో చేయని రుణమాఫీని కాంగ్రెస్ కేవలం 10నెలల్లోనే చేసి చూపిందన్నారు. సమావేశంలో బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి, నాయకులు బండ శంకర్, కల్లెపల్లి దుర్గయ్య, పుప్పాల అశోక్, జున్ను రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

నవదుర్గ పీఠక్షేత్రాన్ని దర్శించుకున్న విప్

అనంతరం జిల్లాకేంద్రంలోని గోవింద్‌పల్లిలోగల నవదుర్గ పీఠక్షేత్రాన్ని అడ్లూరి దర్శించుకున్నారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



బి.స్వాతి



వి.శరణ్య

జగిత్యాలజోన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా నంద్యాలలో ఈనెల ఆరో తేదీ నుంచి పదో తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన బి.స్వాతి (మోడల్ స్కూల్), వి.శరణ్య (ప్రభుత్వ పాఠశాల) ఎంపికయ్యారు. గత నెల రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వీరి ఎంపిక పట్ల జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్, చెన్ను వెంకటేశ్, జిల్లా స్టాఫ్‌బాల్ కోచ్‌లు గౌతమ్, గంగాధర్, ప్రశాంత్, నిర్వాహకులు చెట్‌పల్లి సుధాకర్, మహ్మద్ జమీల్ హర్షం వ్యక్తం చేశారు.

సన్నవడ్లకు రూ.500 బోనస్



జగిత్యాల: సన్నవడ్లకు ఈ సీజన్ నుంచి బోనస్ కింద క్వింటాల్‌కు రూ.500 చెల్లించనున్నట్లు అదనపు కలెక్టర్ రాంబాబు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో శనివారం సమావేశమయ్యారు. వడ్లకు మద్దతు ధర రూ.2,320, కామన్ రకానికి రూ.2,300 చెల్లిస్తామని, సన్న ధాన్యానికి రూ.500 బోనస్ అదనమని పేర్కొన్నారు. కేంద్రాల ఇన్‌చార్జిలతో ఏఈవోలు సమన్వయం చేసుకుంటూ కొనుగోళ్లు చేపట్టాలన్నారు. దొడ్డు రకాన్ని గుర్తించడానికి గ్రెయిన్ కాలిపర్స్, సన్నధాన్యం గుర్తించడానికి డయల్ మైక్రోమీటర్లు ఉంచుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన ప్యాడీ క్లీనర్లను అందుబాటులో ఉంచాలని, టార్పాలిన్లు సిద్ధం చేయాలన్నారు.



బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్ దంపతులు



బతుకమ్మ వేడుకల్లో ఉద్యోగులు


పూలను పూజించే పండుగ బతుకమ్మ

జగిత్యాలటౌన్: పూలను పూజించి.. దేవతలా చూసుకునే ఏకైక పండగ బతుకమ్మ అని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. శనివారం కలెక్టరేట్ ఆవరణలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో కలెక్టర్ దంపతులు పాల్గొని ఆడిపాడారు. మన పండుగ.. మన సంస్కృతి ఆడపడుచుల ఔన్నత్యానికి సూచిక అని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా పూలను పూజించి ప్రకృతిని ప్రేమించే ఏకైక పండుగ బతుకమ్మ అని తెలిపారు. ప్రజలందరూ బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అన్ని శాఖల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



'కాకా'కు నివాళి

జగిత్యాలటౌన్: గడ్డం వెంకటస్వామి (కాకా) పేదలకు ఎల్లప్పుడు అండగా నిలిచారని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయన జయంతిని నిర్వహించారు. కాకా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో మధుసూదన్‌గౌడ్ నివాళి అర్పించారు. బల్దియా కార్యాలయంలో చైర్‌పర్సన్ అడువాల జ్యోతి నివాళి అర్పించారు. బల్దియా కమిషనర్ సమ్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



దాండియా నృత్యం అకాడ విన్యాసం







- చూపరులను ఆకట్టుకుంటున్న వైనం
- ఏటా దేవీ నవరాత్రోత్సవాలు, దసరాకు ప్రత్యేకం
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సందడి వాతావరణం

దాండియా, అకాడ.. దేనికదే ప్రత్యేకం. మొదటిది కోలాట నృత్యాలతో సందడి వాతావరణం తీసుకువస్తే.. రెండోది ఆత్మరక్షణకు ఉపకరించే కర్రసాము, కత్తి తిప్పడం. ఏటా దుర్గాదేవి నవరాత్రోత్సవాల సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మహిళలు, యువత కోలలు చేతపట్టి, పాటలకు తగ్గట్టుగా నృత్యం చేస్తూ అమ్మవారిని కొలుస్తున్నారు. ఇది చూపరులను ఆకట్టుకుంటోంది. ఇక, అకాడ విన్యాసాలు వీరోచితం. చూసేవారిని కళ్లు తిప్పుకోకుండా చేస్తాయి. ఏటా దసరాకు నెల రోజుల ముందే పెద్దపల్లి జిల్లా రామగుండం, ఎన్టీపీసీ, గోదావరిఖని, యైటింక్లయిన్‌కాలనీ ప్రాంతాల్లో కర్రసాము, కత్తి తిప్పడంలో శిక్షణ ఇస్తున్నారు. ఈసారి కళాకారులు అకాడ ప్రదర్శనకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో 'సాక్షి' సండేస్పెషల్.

కరీంనగర్ కల్చరల్/వేములవాడ: దుర్గాదేవి నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని కరీంనగర్ యువత, మహిళల దాండియా నృత్యాలతో హోరెత్తుతోంది. గుజరాత్, రాజస్థాన్, తెలుగు డీజే పాటలకు అనుగుణంగా నృత్యం చేస్తున్నారు. నగరంలోని మహాశక్తి ఆలయంలో ప్రతీరోజు రాత్రి దాండియా సందడి కనిపిస్తోంది. శరీరానికి వ్యాయామం, మనసుకు ప్రశాంతత చేకూరుతాయని చెబుతున్నారు.

దాండియా ప్రత్యేకత..

దాండియా గుజరాత్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన జానపద నృత్యాల్లో ఒకటి. దాండియాకు తెలుగు పదం కోల, కర్ర ముక్క. వీటిని దుర్గాదేవి ఖడ్గమని భక్తులు విశ్వసిస్తారు. ఈ నృత్యం రెండు రకాలు. ఒకటి గర్బా, రెండోది దాండియా. అమ్మవారి హారతి ముందు గర్బా నృత్యాన్ని స్త్రీలు మాత్రమే ప్రదర్శిస్తారు. దాండియాలో పురుషులు, మహిళలు నాట్యం చేస్తారు.

వేములవాడలో కోలాటం

ఎములాడ రాజన్న క్షేత్రం ఏటా బతుకమ్మ వేడుకల సందర్భంగా కోలాట సందడికి వేదికవుతోంది. నిత్యం సాయంత్రం నుంచి రాత్రి 12 గంటల వరకు వేలాది మంది మహిళలు, యువతులు, చిన్నారులు కోలలు చేతపట్టి, పాటలకు అనుగుణంగా నృత్యం చేస్తూ రాజరాజేశ్వరస్వామి వారిని స్మరిస్తున్నారు. ఆలయ అధికారులు లైటింగ్, తాగునీరు, బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

కోల్‌సిటీ/రామగుండం/జ్యోతినగర్: అకాడ.. కళ్లు తిప్పుకోని వ్వని సాహస విన్యాసాలకు ప్రతీక. దసరా వస్తుందంటే పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రాంతంలో ప్రదర్శించే కర్రసాము గుర్తుకువస్తుంది. అకాడలో శిక్షణ ఇచ్చేవారిని వస్తాదులంటారు. వీరు తలపై కొబ్బరికాయ పగులగొట్టడం, తల్వార్‌తో కడుపుపై అరటి పండును కట్ చేయడం, తల్వార్లు, కర్ర, రంపాలను తిప్పుతూ శత్రువు దాడి నుంచి తప్పించుకోవడం నేర్పిస్తారు. గోదావరిఖనిలో మాజీ ఎమ్మెల్యే మాలెం మల్లేశం జాగృతి కల్చరల్ సొసైటీ పేరిట నిర్వహించిన దసరా ఉత్సవాల్లో అకాడ ప్రదర్శించేవారు. శ్రీరాంబాలక్, జై భారత్ హనుమాన్, నేషనల్ మహావీర్ తదితర అకాడ సంస్థలు ఏర్పడ్డాయి. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణ కాలనీకి చెందిన కంది రాజయ్య 25 ఏళ్లు అకాడ ప్రదర్శన ఇచ్చారు. ఆయన మరణానంతరం కుమారుడు నాగరాజు స్థానిక విశ్వభారతి హైస్కూల్లో యువతకు శిక్షణ ఇస్తున్నారు.

ప్రజాప్రతినిధులైన పలువురు

మాజీ ఎమ్మెల్యేలు మాలెం మల్లేశం, కొప్పుల ఈశ్వర్ అకాడ ప్రదర్శనలతో ప్రజలను ఆకట్టుకొని, ఎమ్మెల్యేలు, మంత్రులుగా ఎదిగారు. బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి, పాలకుర్తి జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు కందుల సంధ్యారాణి కర్రసాములో అదరగొడుతున్నారు. 50 మందికిపైగా గృహిణులు, యువతులకు ఉచితంగా కర్రసాముపై శిక్షణ ఇచ్చారు.

ఉత్సాహాన్నిస్తుంది



దుర్గామాతను కొలుస్తూ ఆడే దాండియా ఉత్సాహాన్నిస్తుంది. దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత రోజు నుంచి అర్ధరాత్రి వరకు ఆడుతున్నాం. భక్తిశ్రద్ధలతో దేవిని కొలిస్తే కోరికలు తీరుతాయి.

– రిధి, కరీంనగర్

వారం రోజులు పండుగే..



బతుకమ్మ వేడుకల సందర్భంగా రోజూ రాజన్న గుడికి చేరుకొని, దాండియా ఆడుతున్నాం. ఇక్కడ వారం రోజులపాటు పండుగ వాతావరణం కనిపిస్తుంది. వయోభేదం లేకుండా అందరం కలిసి, కోలలు వేస్తూ, డ్యాన్స్ చేస్తున్నాం.

– ప్రతాప అనూష, వేములవాడ

నృత్యంతో వ్యాయామం



ఐదేళ్ల నుంచి దాండియా ఆడుతున్నా. ఏటా దుర్గామాత పూజల్లో భాగంగా దాండియా సంప్రదాయం కొనసాగుతోంది. నృత్యంతో అమ్మవారిని కొలుస్తాం. దాండియాతో మంచి వ్యాయామం అవుతుంది.

– మేఘన, చైతన్యపురి, కరీంనగర్

మానసికోల్లాసం..



దాండియా ఆడటం వల్ల మానసికోల్లాసం కలుగుతుంది. ఇందుకోసం శిక్షణ తీసుకున్నాం. ప్రత్యేకంగా స్టెప్పులు నేర్చుకున్నాం. రాజన్న గుడి వద్ద ఇల్లు, పని మరిచిపోయేలా కోలాట నృత్యంలో నిమగ్నమవుతున్నాం. సంతోషంగా ఉంది.

– కాసారపు లక్ష్మీప్రసన్న, వేములవాడ

సండే స్పెషల్

ప్రతీ ఆడబిడ్డ నేర్చుకోవాలి



ఆడవాళ్లపై దాడులు, అఘాయిత్యాలు పెరుగుతున్నాయి. వాటిని ఎదుర్కోవడానికి ప్రతీ ఆడబిడ్డ కర్రసాము నేర్చుకోవాలి. నేను పదేళ్ల క్రితం మాస్టర్ వడ్డేపల్లి సురేశ్ వద్ద నేర్చుకున్న. ఆసక్తి ఉన్నవారు నన్ను సంప్రదించండి.

– కందుల సంధ్యారాణి

37 ఏళ్లుగా ప్రదర్శిస్తున్నం



అకాడను బతికించుకోవడానికి గోదావరిఖనిలో 37 ఏళ్లుగా ప్రతీ దసరాకు ప్రదర్శిస్తున్నం. సొంతంగా రూ.60 వేలకు పైగా ఖర్చు చేస్తున్నం. ఈసారి బాలికలు, యువతులతోనే ప్రదర్శనలు ఇవ్వడానికి శిక్షణ ఇస్తున్నం.

– మచ్చ శంకర్, వస్తాద్, జై భారత్ హనుమాన్ అకాడ సంస్థ

ఆడవాళ్లకు రక్షణ



నేను కర్రసాము నేర్చుకుంటున్న. చేతితో కర్ర తిప్పడం వల్ల వ్యాయామం చేసినట్లు ఉంటుంది. ఇది ఆడవాళ్లకు రక్షణనిస్తుంది. ప్రతిఒక్కరూ నేర్చుకోవాలి.

– సిరివెన్నెల, అన్నపూర్ణకాలనీ

మా నాన్నే ఆదర్శం



మా నాన్న రాజయ్య నాకు ఆదర్శం. దసరా ఉత్సవాలకు కర్రసాము ప్రదర్శనలు ఆగిపోవద్దు.. నువ్వు కూడా నేర్చుకో అని ప్రోత్సహించేవారు. యువతకు ఉచితంగా నేర్పిస్తున్న. నా కొడుకు సాగర్‌కు కూడా శిక్షణ ఇస్తున్న.

– కంది నాగరాజు, అకాడ మాస్టర్



- 'ఈ చిత్రంలో కనిపిస్తున్నది హన్మాన్‌నగర్‌లోని ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ ప్లాట్లు. వీటిని ఏళ్లుగా యాజమానులు పట్టించుకోకపోవడంతో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. దీనిపై పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ప్రాంతంలో కూడా ఖాళీ స్థలాలన్నీ పిచ్చి మొక్కలతోనే నిండి ఉండడం గమనార్హం.

- శుభ్రం చేయడంపై నిర్లక్ష్యం చూపుతున్న యజమానులు
- సమస్యలకు నిలయంగా మారుతున్న వైనం
- ఇబ్బంది ఎదుర్కొంటున్న కాలనీల ప్రజలు

ఖాళీ పాట్లు..జనం పాట్లు



ఈ చిత్రంలో పిచ్చిమొక్కలతో నిండిన ఖాళీ ప్లాట్లు పట్టణ శివారులోని సిద్ధి వినాయక నగర్‌లోనివి. ఇళ్ల మధ్య ఉన్న ఈ ప్లాట్లు పాములకు నిలయంగా మారాయి. వీటి బెడదతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా రాత్రిపూట బయటకు రావాలంటేనే జంకుతున్నారు. కాలనీలో ఇలా ఇళ్ల మధ్య పెద్ద సంఖ్యలో ప్లాట్లు ఉన్నాయి. వాటి యాజమానులు నిర్లక్ష్యంగా వదిలేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మెట్‌పల్లి: మెట్‌పల్లి మున్సిపాలిటీలో ఖాళీ స్థలాలు కాలనీవాసులకు సమస్యగా తయారయ్యాయి. శివారు కాలనీల్లో ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ ప్లాట్లు పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. ఈ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా ఖాళీ ప్లాట్లు దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలతో కనిపిస్తాయి. వీటి విషయంలో అటు సంబంధిత యాజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే.. ఇటు మున్సిపల్ అధికారులు కూడా ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఈ కాలనీల్లో సమస్య అధికం

- పట్టణంలో మొత్తం 26 వార్డులు ఉన్నాయి. టీచర్స్‌కాలనీ, సిద్ధివినాయకనగర్, హన్మాన్‌నగర్, వెంకట్రావ్‌పేట, బీడీకాలనీ, ఐపీ కాలనీ, సాయి రాంనగర్, అర్బన్ హౌజింగ్ కాలనీ, బాలకృష్ణ నగర్ ప్రాంతాల్లో ఖాళీ ప్లాట్లు ఉన్నాయి.
- వాస్తవానికి సంబంధిత యజమానులు ఖాళీప్లాట్లను తరుచూ శుభ్రం చేయాల్సి ఉంటుంది. కాని వారు అలసత్వం చూపుతుండడంతో పిచ్చిమొక్కలతో నిండిపోతున్నాయి. కొన్నిచోట్ల వర్షాకాలంలో వరదనీరు ప్లాట్లల్లోకి వచ్చి చేరుతోంది. దీంతో అది మురుగుగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. దోమల వ్యాప్తికి దోహదపడుతున్నాయి.
- మరికొన్ని చోట్ల పాములకు నిలయంగా మారాయి. విషసర్పాలు పట్టపగలే సంచరిస్తుండడంతో తరచూగా ఇళ్లలోకి రావడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

యజమానులకు నోటీసులు ఇస్తాం



ఖాళీ ప్లాట్లతో ఇబ్బందులున్న చోట సంబంధిత యజమానుల వివరాలను మున్సిపల్‌కు అందించాలి. అలాంటి వారికి ప్లాట్లను శుభ్రం చేసుకోవాలని నోటీసులు ఇస్తాం. అయినా వారు స్పందించకుంటే వారికి జరిమానా విధించేలా చర్యలు తీసుకుంటాం.

– కమిషనర్, మోహన్

పట్టించుకోని అధికారులు

- ఖాళీ ప్లాట్లతో చుట్టుపక్కల నివాసముంటున్న వారికి ఇబ్బంది కలగకుండా యజమానులు వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి.
- ఒకవేళ శుభ్రం చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మున్సిపల్ అధికారులు అలాంటి వారిని గుర్తించి నోటీసులు జారీ చేయాలి
- నోటీసులకు స్పందించనిపక్షంలో యజమానులపై చర్యలు తీసుకునే అవకాశముంటుంది.
- అధికారులు అలాంటి వారికి కనీసం నోటీసులు కూడా ఇవ్వడం లేదు.
- సమస్యపై ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొండగట్టులో 100 గదుల నిర్మాణం


- స్థలాన్ని పరిశీలించిన టీటీడీ అధికారులు
- పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం
- తీరనున్న అంజన్న భక్తుల కష్టాలు



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యం, టీటీడీ అధికారులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టుపై సుమారు వంద గదులు నిర్మించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ముందుకొచ్చింది. గదుల నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని శనివారం టీటీడీ ఆలయ డీఈ పీవీ.నాగరాజు, ఏఈ జే.నాగరాజుతో కలిసి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరిశీలించారు. ఘాట్ రోడ్డు పక్కన.. బొజ్జ పోతన్న ఆలయ సమీపంలోని స్థలాలను పరిశీలించారు. ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం, డిప్యూటీ సీఎం సహకారంతో కొండగట్టుపై 100 గదులు నిర్మించడానికి టీటీడీ ముందుకొచ్చిందన్నారు. హనుమాన్ దీక్షాపరుల మాలవిరమణ మండపాన్ని కూడా నిర్మిస్తామన్నారు. అరుణాచలం గిరిప్రదక్షిణ తరహాలో కొండగట్టు గిరిప్రదక్షిణకు రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఆలయ ఈవో రామకృష్ణారావు, ఏఈఓ అంజయ్య, ప్రధాన అర్చకులు జితేంద్రప్రసాద్, ఉప ప్రధాన అర్చకులు చిరంజీవి, స్థానాచార్యుడు కపిందర్, నాయకులు బత్తిని శ్రీనివాస్ గౌడ్, కమలాకర్ రెడ్డి ఆది రెడ్డి, ముత్యం శంకర్ గౌడ్, అజయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హన్మత్ వాహనంపై నృసింహుడు



ధర్మపురి: శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వాములను హన్మత్ వాహనంపై ఊరేగించారు. దారి పొడవునా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.

క్లుప్తంగా

ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తా

- అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి



పూజలు చేస్తున్న నరేందర్ రెడ్డి

చొప్పదండి: తనను పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపిస్తే యువతకు పోటీ పరీక్షల కోసం ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తానని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం చొప్పదండి పట్టణంలోని పలువురు ప్రైవేట్ టీచర్లను కలిశారు. తనకు మద్దతు తెలపాలని కోరారు. అనంతరం దుర్గాదేవి మండపాలకు వెళ్లి, పూజలు చేశారు. ఎమ్మెల్సీగా గెలిస్తే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో తాచుపాము



తాచుపామును పట్టుకున్న ఖాసీం

మల్యాల(చొప్పదండి): మల్యాల మండల పరిషత్ కార్యాలయం బాత్రూంలోకి తాచుపాము చొరబడడంతో ఉద్యోగులు ఆందోళన చెందారు. శనివారం ఉదయం బాత్రూంలో ఉన్న తాచుపామును సూపరింటెండెంట్ నాగరాజు గమనించి మల్యాల కార్యదర్శి శ్రీకాంత్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే పాములు పట్టే ఖాసీంకు సమాచారం ఇవ్వగా, పామును పట్టుకొని సమీప అటవీప్రాంతంలో వదిలేశారు.

అక్రమ కట్టడం కూల్చివేత



ఇంటిని కూల్చుతున్న జేసీబీ

ఇల్లతకుంట(మానకొండూర్): ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన ఇంటిని శనివారం అధికారులు జేసీబీతో కూల్చివేశారు. తహసీల్దార్ ఎంఏ ఫరూక్ తెలిపిన వివరాలు.. ఇల్లంతకుంట మండలం సిరికొండ గ్రామంలోని సర్వే నంబర్ 107లో ప్రభుత్వ భూమి 8 గుంటల స్థలంలో మాజీ సర్పంచ్ నీలం అంజయ్య అక్రమంగా ఇంటితో పాటు ప్రహరీ నిర్మించాడు. అక్రమ కట్టడాలను తొలగించాలని అంజయ్యకు నోటీసులు జారీ చేసినా స్పందించలేదు. ఈక్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అక్రమ కట్టడాలను పోలీసు బందోబస్తు మధ్య జేసీబీతో కూల్చివేసినట్లు తహసీల్దార్ వివరించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్‌గౌడ్, సిబ్బంది, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మల్యాల రైల్వేస్టేషన్‌కు మహర్దశ

- ప్రయాణికుల చేతిలోనే స్టేషన్ భవిష్యత్
- పలు రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం
- టికెట్ కౌంటర్ ఏర్పాటు
- వినియోగించుకుంటేనే కొనసాగింపు
- లేకుంటే ఎత్తివేత దిశగా నిర్ణయం?



నూకపల్లి, మల్యాల రైల్వే స్టేషన్

మల్యాల(చొప్పదండి): మల్యాల అభివృద్ధికి అండగా నిలిచేందుకు.. రైల్వేస్టేషన్ ఏర్పాటుకు సహకరించి ప్రజారవాణాకు భూములు ఇచ్చినవారి త్యాగానికి ఫలితం దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. మల్యాల రైల్వేస్టేషన్‌లో రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించిన రైల్వేశాఖ.. ఆర్నెళ్లపాటు రైల్వేకు వచ్చే ఆదాయాన్ని ప్రామాణికంగా తీసుకుని స్టేషన్‌ను కొనసాగించాలా..? లేక రద్దు చేయాలా..? అని తేల్చనుంది. ఈ నిబంధనతోనే ఈ స్టేషన్‌లో టికెట్ కౌంటర్ ప్రారంభించి రైళ్లు ఆపాలని రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

జాతీయ రహదారికి 200 మీటర్ల దూరంలో..

మల్యాల మండలంలోని నూకపల్లి శివారులో జగిత్యాల – కరీంనగర్ జాతీయ రహదారికి 200 మీటర్ల దూరంలో నూకపల్లి–మల్యాల రైల్వేస్టేషన్‌ను ఏర్పాటు చేసిన విషయం తెల్సిందే. ఈ రైల్వే స్టేషన్ ఏర్పాటుకు నూకపల్లి, రామన్నపేట, పోతారం గ్రామాల ప్రజలు తమ విలువైన భూములను త్యాగం చేశారు. ఈ రైల్వే స్టేషన్‌లో గతంలో రైళ్లు నిలిపినా.. టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు రైలు ప్రయాణానికి పెద్దగా ఆసక్తి చూపలేదు. ఈ క్రమంలో స్టేషన్ కొనసాగింపుపై తర్జనభర్జనలు మొదలయ్యాయి. ఇటీవల రైల్వే అధికారులు సీ/టీ/454/2024 ఉత్తర్వులు జారీ చేశారు. ఆగస్టు 16న స్టేషన్‌లో టికెట్ కౌంటర్ ఏర్పాటు చేశారు. అప్పటినుంచి ఈ స్టేషన్ నుంచి ప్రయాణించే వారి సంఖ్య, ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని.. రైళ్లకు హాల్టింగ్ కల్పించడమా.. ? లేదా..? టికెట్ కౌంటర్ ఉంచాలా..? ఎత్తివేయాలా..? అని నిర్ణయించనున్నారు. ప్రస్తుతం ఈ స్టేషన్‌లో ప్రయోగాత్మకంగా హైదరాబాద్, బోధన్ పుష్‌పుల్ రైళ్లను మాత్రమే నిలుపుతున్నారు. నిత్యం కాచిగూడ నుంచి కరీంనగర్‌కు ఒక రైలు నడుస్తుండగా.. మరో రైలు బోధన్ నుంచి కరీంనగర్‌కు నడుస్తోంది.

ప్రయాణ భారం అతి తక్కువ..

స్టేషన్‌లో ప్రతినిత్యం కాచిగూడ నుంచి కరీంనగర్‌కు ఒక రైలు.. బోధన్ వరకు మరో నడుస్తోంది. మల్యాల నుంచి సాయంత్రం 4.05 గంటలకు బయలుదేరి రాత్రి 23.10గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. మల్యాల నుంచి కాచిగూడకు కేవలం రూ.60 మాత్రమే. మల్యాల నుంచి గంగాధర, కరీంనగర్‌కు రూ.10, మల్యాల నుంచి కోరుట్ల, మెట్‌పల్లి వరకు రూ.10, ఆర్మూర్, మోర్తాడ్‌కు రూ.20, నిజామాబాద్‌కు రూ.25, కామారెడ్డి రూ.35, మల్కాజిగిరి రూ.55 మాత్రమే. ఆర్టీసీ బస్సులతో పోల్చితే వాటి టికెట్ ధరలో ఏడో వంతు మాత్రమే చెల్లిస్తే కరీంనగర్‌కు చేరుకోవచ్చు.

అందుబాటులో మల్యాల రైల్వేస్టేషన్

జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారికి కేవలం 200మీటర్ల దూరంలో మాత్రమే రైల్వే స్టేషన్ ఉంది. జగిత్యాల బస్‌స్టేషన్ నుంచి బస్సులో కేవలం పదినిమిషాల్లో మల్యాల రైల్వే స్టేషన్‌కు చేరుకోవచ్చు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

రైల్వేస్టేషన్‌కు కాపాడుకోవాలి



రైల్వేస్టేషన్‌లో ప్రయోగాత్మకంగా చేపట్టిన రైళ్ల నిలుపుదలను శాశ్వతంగా నిలిపేలా ప్రజలు రైళ్లలో ప్రయాణించాలి. మల్యాల మండల ప్రజలు ఇకపై కరీంనగర్, హైదరాబాద్ వెళ్లేందుకు రైళ్లను సద్వినియోగం చేసుకుని, రైల్వే స్టేషన్‌కు కాపాడుకోవాలి. – వడ్డెపల్లి శశాంక్, సామాజిక సేవకుడు మల్యాల

కొండగట్టు వచ్చే భక్తులకు మేలు



కొండగట్టుకు వచ్చే భక్తులకు రైల్వేస్టేషన్ ఎంతో సౌకర్యంగా ఉంటుంది. రైల్వేస్టేషన్‌కు కొండగట్టు కేవలం మూడు కిలోమీటర్ల దూరంలోనే ఉండడంతోపాటు, జాతీయ రహదారికి సమీపంలో ఉంది. రాత్రివేళలోనూ రైల్వేస్టేషన్‌కు చేరుకోవడం సులభం.

– యాగండ్ల సుమన్, మల్యాల

ఉపాధి పెరుగుతుంది



రైల్వే స్టేషన్‌తో ఆటో కార్మికులు, కూరగాయల వ్యాపారులు, ప్రయాణికులకు ఎంతో మేలు జరుగుతుంది. జాతీయ రహదారికి అతి సమీపంలో ఉండడంతో ప్రయాణికులకు కూడా సౌకర్యంగా ఉంది. ప్రజలు రైళ్లలో ప్రయాణించేలా అవగాహన కల్పించాలి.

– జోగినిపల్లి రాజు, విద్యావేత్త

చెల్లెను వేధిస్తున్నాడనే కోపంతో..

- బావను హత్యచేసిన బావమరిది అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు



అరెస్టు చూపుతున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ సురేశ్‌బాబు, ఎస్సై నవీన్‌కుమార్

కథలాపూర్(వేములవాడ): చెల్లెను వేధిస్తున్నాడనే కోపంతో బావను హత్యచేసిన బావమరిదిని పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు వివరాలు వెల్లడించారు. కథలాపూర్ మండలం చింతకుంట గ్రామానికి చెందిన నేతుల మల్లేశంకు ఇదే మండలం భూషణరావుపేటకు చెందిన లావణ్యను ఇచ్చి 22 ఏళ్ల క్రితం వివాహం జరిపించారు. వీరికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. 2015లో మల్లేశం తన సొంత కుమారుడిని బావిలో పడేసి చంపేశాడు. ఏడేళ్ల జైలు శిక్ష అనుభవించి ఏడాది క్రితం ఇంటికి వచ్చాడు. మల్లేశం కొన్ని నెలలుగా భార్య లావణ్య, కూతురును వేధిస్తూ చంపేస్తానని బెదిరిస్తున్నాడు. ఈక్రమంలో మల్లేశం తీరును చూసిన లావణ్య అన్న భూషణరావుపేటకు చెందిన భూపతి గంగారాం విసిగిపోయాడు. మల్లేశం బతికి ఉంటే తన చెల్లెలు, కోడలును చంపుతాడని భావించిన గంగారాం ఈనెల 1న మల్లేశంకు ఫోన్ చేసి ఇంటికి పిలిపించుకున్నాడు. మధ్యాహ్నం నుంచి ఇద్దరూ మద్యం తాగి రాత్రివేళ దుంపేట గ్రామశివారులోని వరదకాలువ వద్దకు చేరుకున్నారు. మల్లేశం మద్యం మత్తులో ఉండటంతో ఇదే అదనుగా భావించిన గంగారాం, అతడి తలపై రాయితో కొట్టి బ్రిడ్జికి బలంగా తలను బాదాడు. అనంతరం మల్లేశం మృతదేహాన్ని వరదకాలువలో పడేసి బైక్‌ను కాలువ పక్కన ఉంచి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. ఈ నెల 2న మల్లేశం అదృశ్యమైనట్లు అన్న రాజమల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వరదకాలువ వద్ద బైక్ ఉండటంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈనెల 4న మల్లేశం మృతదేహం మేడిపెల్లి మండలం విలయాతబాద్ శివారులోని వరదకాలువలో కనిపించింది. గంగారాం అనుమానాస్పదంగా కనిపించడంతో శుక్రవారం మధ్యాహ్నం పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. నిందితుడిని శనివారం కోర్టులో హాజరుపరిచినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. హత్య కేసులో ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కేసును త్వరగా ఛేదించిన కోరుట్ల సీఐ సురేశ్‌బాబు, కథలాపూర్ ఎస్సై నవీన్‌కుమార్‌ను డీఎస్పీ అభినందించారు.

మానేరువాగులో దూకిన మహిళ

- కాపాడిన డిస్ట్రిక్ట్ గార్డ్



మానేరువాగులో ఈదుతూ మహిళను బయటకు తీసుకువస్తున్న డిస్ట్రిక్ట్ గార్డ్ దేవరాజు

సిరిసిల్లక్రైం: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన మహిళ ఆత్మహత్య చేసుకునేందుకు మానేరు వాగులో దూకగా, డిస్ట్రిక్ట్ గార్డ్ దేవరాజు గమనించి సదరు మహిళను రక్షించాడు. వివరాలు.. సిరిసిల్ల పట్టణం అంబేద్కర్‌నగర్‌కు చెందిన సిరిగిరి లక్ష్మి కుటుంబ కలహాలతో శనివారం ఉదయం ఆత్మహత్య చేసుకునేందుకు మానేరువాగులో దూకింది. అదే సమయంలో అటువైపుగా వెళ్తున్న డిస్ట్రిక్ట్ గార్డ్ కానిస్టేబుల్ దేవరాజు చూసి వెంటనే వాగులోకి దూకి మహిళను రక్షించాడు. సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈసందర్భంగా సకాలంలో స్పందించి వాగులోకి దూకి మహిళను కాపాడిన దేవరాజును, సిరిసిల్ల టౌన్ పోలీసులను ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు.

ఏడాదిగా ఆదివాసీ కుటుంబం ఆవేదన

- ధరావత్ పెట్టలేదని కుల బహిష్కరణ
- ఇటీవల ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు
- తీవ్ర మనస్తాపానికి గురువుతున్న ఆదివాసీ కుటుంబం



న్యాయం చేయాలని వేడుకుంటున్న బాధితులు

మల్లాపూర్(కోరుట్ల): కులసంఘంలో ధరావత్ పెట్టలేదని ఓ కుటుంబాన్ని ఏడాదిగా కుల బహిష్కరణ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇటీవల పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఆ కుటుంబానికి న్యాయం జరగలేదు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం రత్నాపూర్‌లో నాయకపోడు కులానికి చెందిన కూచన్‌పెల్లి నడిపి మల్లయ్య– నర్సు దంపతులకు కుమార్తె, ఇద్దరు కుమారులు సంతానం. చిన్న కుమారుడు కూచన్‌పెల్లి శ్రీనివాస్ భార్య లక్ష్మి, కుమారుడు మహంతితో కలిసి ఉంటున్నాడు. గ్రామంలో పోస్టుమాస్టర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌కు, అతడి అన్న కూచన్‌పెల్లి భూమేశ్‌కు మధ్య కొంతకాలంగా భూతగాదాలతో గొడవలు జరుగుతున్నాయి. భూవివాదం పరిష్కారానికి కులసంఘం పెద్దలను ఆశ్రయించగా, అన్నదమ్ములిద్దరూ రూ.25వేల ధరావత్, మరో రూ.25వేలకు ఒకరిని జమనాతుదారుగా ఇవ్వాలని సూచించారు. దీంతో వీరి వద్ద తనకు న్యాయం జరగదని శ్రీనివాస్ ధరావత్, జమనాతుదారుడిని పెట్టనని తేల్చిచెప్పడంతో కులసంఘం పెద్దలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇక నుంచి శ్రీనివాస్ కుటుంబాన్ని కులం నుంచి వెలివేస్తున్నామని, కులస్తులు వారితో మాట్లాడరాదని, వారి ఇంటికి వెళ్లవద్దని హెచ్చరించారు. ఈ క్రమంలో కులస్తులు ఎవరూ కూడా శ్రీనివాస్ కుటుంబంతో మాట్లాడటం లేదు. శుభకార్యాలకు పిలవడం లేదు. అందరూ కలిసి ఉపయోగించే రిగ్గుమోటార్ వద్దకు నీటికోసం రానివ్వడం లేదు. ఇలా ఏడాదిగా బాధిత కుటుంబం తీవ్ర మనస్తాపానికి గురవుతూ ఇబ్బందులు పడుతున్నారు. బాధిత కుటుంబాన్ని కుల సంఘంలో కలుపుకోవాలని స్థానిక నాయకులు సూచించినా కులపెద్దలు పట్టించుకోలేదు. దీంతో విసిగి వేసారిన శ్రీనివాస్ కుమారుడు తమకు న్యాయం చేయాలని ఈ ఏడాది ఆగస్టు 3న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎలాంటి విచారణ చేపట్టలేదని బాధిత కుటుంబం వాపోయింది. ఇటీవల సదరు కులసంఘానికి చెందిన యువకులు నిర్వహించుకున్న వినాయక ఉత్సవాల్లో మహంతికి చెందిన డీజే సౌండ్ సిస్టం వినియోగించారని యువకులకు జరిమానా సైతం విధించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

వివాదాస్పద భూముల సర్వే



ఇబ్రహీంపట్నం: తిమ్మాపూర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో, డీఎఫ్‌వో

ఇబ్రహీంపట్నం/మల్లాపూర్: ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల్లోని వివాదాస్పద భూములను అటవీశాఖ, రెవెన్యూ అధికారులు శనివారం జయింట్ సర్వే నిర్వహించారు. ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్ శివారు సర్వే నంబర్ 131లో నిమ్మల మల్లేశ్ రెండెకరాలు, వెలిచల గంగు 32 గుంటలు, సర్వే నంబర్ 87లో నిమ్మల రాజగంగు 1.10 ఎకరాలు, వెలిచల పెద్ద గంగాధరం 21గుంటల్లో పంటలు పండించుకుంటున్నారు. అది ఫారెస్ట్ భూమి అని అటవీశాఖ అధికారులు కందకాలు కొట్టారు. దీంతో బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ డీఎఫ్‌వో రవిప్రసాద్ రికార్డులు పరిశీలించి, జాయింట్ సర్వే చేశారు. తహసీల్దార్ ప్రసాద్, ఇన్‌చార్జి ఎఫ్ఆర్‌వో పద్మారావు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ చైతన్యశ్రీ, ఫారెస్ట్ బీట్ అధికారులు మధుసూదన్, సత్తర్, ఆర్ఐ రమేశ్ పాల్గొన్నారు. మల్లాపూర్ మండలంలోని మొగిలిపేట, కుస్తాపూర్, రత్నాపూర్, నడికుడ, సంగెంశ్రీరాంపూర్ గ్రామాల్లో సుమారు 800 ఎకరాల మధ్య వివాదం ఉందని అధికారులు తెలిపారు. భూ సమస్య పరిష్కారానికి జాయింట్ సర్వేకు నిర్ణయించినట్లు తెలిపారు. తహశీల్దార్ వీర్‌సింగ్, ఆర్ఐ సురేష్, డిప్యూటీ ఆర్వో హఫీజుద్దీన్ పాల్గొన్నారు.

'పేదల ఇళ్లు కూల్చితే ఊరుకోబోం'



మాట్లాడుతున్న శ్రీకాంత్

జగిత్యాలటౌన్: మూసీనది సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లను కూలిస్తే ఊరుకునేదిలేదని సీపీఎం రాష్ట్ర నాయకులు పుప్పాల లింబాద్రి అన్నారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వ్యాపార ప్రయోజనాలు, కమీషన్ల కోసం పేదల ఇళ్లు కూల్చివేస్తూ అక్కడి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. మూసి సుందరీకరణ పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలు నాశనం చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. దీనికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ తిరుపతినాయక్, గర్వందుల రమేశ్, వెంకటాచారి తదితరులు ఉన్నారు.

తల్లిదండ్రులను విస్మరిస్తే జైలుకే



కౌన్సెలింగ్ ఇస్తున్న ఆర్డీవో

జగిత్యాల: వృద్ధాప్యంలో తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ బాధ్యత పిల్లలదేనని, విస్మరించిన వారు శిక్షార్హులేనని జగిత్యాల ఆర్డీవో, వయోవృద్ధుల ట్రిబ్యునల్ చైర్మన్ పి.మధుసూదన్ హెచ్చరించారు. తన కార్యాలయంలో శనివారం వృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం కింద దాఖలైన కేసుల్లో కొడుకులు, కోడళ్లు, కూతుళ్లు ఆర్డీవో ముందు విచారణకు హాజరయ్యారు. మల్యాల మండలం తక్కళ్లపల్లికి చెందిన తోట్ల కొంరయ్య, బుగ్గారం మండలం గోపులాపూర్ చెందిన పెరుమండ్ల లింగవ్వ, జిల్లాకేంద్రంలోని వంజరివాడకు చెందిన కాలేరు ఈశ్వరయ్య, కృష్ణానగర్‌కు చెందిన వేముల లీలావతి ఫిర్యాదులపై విచారణ జరిపారు. తమ కుమారుల నుంచి పోషణ, వైద్య ఖర్చులు, ఆస్తులు తిరిగి ఇప్పించాలని వృద్ధుల తరఫున సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ వాదనలు వినిపించారు. ఫిర్యాదుదారుల కుమారులు, కోడళ్లు, కూతుళ్ల మాటలు విని సాక్ష్యాధారాలు పరిశీలించారు. తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టవద్దని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలింగ్ ప్రతినిధులు గౌరిశెట్టి విశ్వనాథం, వెల్మల ప్రకాశ్ రావు, సీనియర్ సహాయకులు పద్మజ తదితరులు ఉన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు రెఫరీలుగా ఎంపిక

కరీంనగర్ కల్చరల్: జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు రెఫరీలుగా కరీంనగర్ జిల్లాకు చెందిన నమిలికొండ ప్రభాకర్, మూల వెంకటేశ్ ఎంపికయ్యారని తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ తెలిపారు. ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో పోటీలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారిని అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, క్రీడా సంఘాల ప్రతినిధులు శనివారం అభినందించారు.

జపాన్ టూర్‌కు 'నవోదయ' విద్యార్థి



రిత్విక్ రెడ్డి

చొప్పదండి: జపాన్‌లో సకుర సైన్స్ ప్రాజెక్టుల పరిశీలనకు చొప్పదండి జవహర్ నవోదయ విద్యాలయ ఇంటర్ విద్యార్థి పి.రిత్విక్ రెడ్డి ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ మంగతాయారు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టూర్‌కు దేశవ్యాప్తంగా 660 నవోదయ విద్యాలయాల నుంచి విద్యార్థులు పోటీపడగా మొత్తం 20 మందిని ఎంపిక చేశారన్నారు. వీరు ఈ నెల 18 నుంచి 26 వరకు జపాన్‌లోని యూనివర్సిటీలు, నూతన పరిజ్ఞాన పరిశోధన కేంద్రాలను సందర్శించి, అక్కడివారితో ముచ్చటించనున్నారని తెలిపారు. దక్షిణ భారతదేశం నుంచి కర్ణాటకలోని మాండ్య, చొప్పదండి విద్యాలయాల విద్యార్థులకే ఈ అవకాశం లభించిందన్నారు.

లాభాల వాటా చెల్లింపు ఇలా..

గోదావరిఖని: సింగరేణి కార్మికులకు లాభాల వాటా చెల్లింపు తీరుపై యాజమాన్యం నిర్ణయం తీసుకున్నట్లు ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. వచ్చిన లాభాల్లో విధులకు హాజరుపై 85శాతం చొప్పున రూ.679కోట్లు, గ్రూప్ పనితీరుపై 14శాతం చొప్పున రూ.111.45 కోట్లు, ఇన్సెంటివ్‌పై ఒకశాతం లెక్కన రూ.5.57 కోట్లు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. అండర్ గ్రౌండ్‌లో పనిచేసే కార్మికులకు రోజుకు రూ.771.11, సర్ఫేస్‌లో పనిచేసే వారికి రూ.610.46, డిపార్ట్‌మెంట్లలో పనిచేసే వారికి రూ.563.50 చొప్పున లెక్కించి గతంలో చెప్పినవిధంగా చెల్లించనున్నట్లు పేర్కొన్నారు.



బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు, మహిళా అధ్యాపకులు

'జ్యోతిష్మతి'లో బతుకమ్మ ఆటాపాటా

తిమ్మాపూర్ జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(అటానమస్) చైర్మన్ జువ్వాడి సాగర్ రావు ఆధ్వర్యంలో శుక్రవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి బతుకమ్మపై ఆడపిల్లలను కాపాడాలని, మత్తు పదార్థాలు నిషేధించాలని, కాలుష్యం పర్యావరణాన్ని కాపాడాలని భవిష్యత్తు కోసం మరిన్ని చెట్లు నాటాలని ప్రజలకు తెలియజేసేలా ఫ్లకార్డులు ప్రదర్శించారు. కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు విద్యార్థులకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతిగా నగదు అందజేశారు. పాల్గొన్న విద్యార్థులకు కన్సోలేషన్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ జువ్వాడి సుమిత్ సాయి, ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ రావు, డాక్టర్ పీకే వైశాలి, హెచ్‌ఓడీ లు, మహిళాఅధ్యాపకులు విద్యార్థులు తదితరులు ఉన్నారు. – తిమ్మాపూర్



బతుకమ్మల వద్ద ఫ్లకార్డులతో విద్యార్థినులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



రమేశ్‌రెడ్డి (ఫైల్)

తిమ్మాపూర్: రోడ్డుప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన ఘటన కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ పరిధిలోని అల్గునూర్‌లో శనివారం రాత్రి జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పోరండ్లకు చెందిన రావుల రమేశ్ రెడ్డి(34) కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు కారు షోరూంలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. పనినిమిత్తం శనివారం రాత్రి పోరండ్ల నుంచి కరీంనగర్‌కు బయల్దేరిన రమేశ్ అల్గునూర్ వద్ద ఆగాడు. కాలినడకన రోడ్డు దాటుతుండగా కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని లారీ ఆయనను ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. ఈ విషయమై ఎల్ఎండీ ఎస్సై వివేక్ వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. రమేష్ రెడ్డి ఇటీవల ప్రేమ వివాహం చేసుకున్నాడు. అతని తండ్రి సిద్దిపేట కమిషనరేట్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది.

అన్నను హతమార్చిన తమ్ముడు



రాజు (ఫైల్)

హుజూరాబాద్‌రూరల్: ఆస్తి కోసం సొంత అన్నను హతమార్చాడు ఓ వ్యక్తి. తల్లిదండ్రులతో కలిసే ఈ ఘాతుకానికి పాల్పడిన ఘటన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలంలోని రాజాపల్లిలో చోటుచేసుకుంది. హుజూరాబాద్ టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ వివరాల ప్రకారం.. రాజాపల్లికి చెందిన నోముల చంద్రయ్య–ఎల్లమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు రాజు(35), అంజి ఉన్నారు. రాజు శుక్రవారం అర్ధరాత్రి చనిపోయాడు. శనివారం ఉదయం అతని తల్లిదండ్రులు తమ కుమారుడు లేవడం లేదంటూ రోదించడంతో స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఏసీపీ శ్రీనివాస్‌జీ, సీఐ తిరుమల్‌గౌడ్, ఎస్సై యూనస్ సంఘటన స్థలానికి చేరుకొని, రాజు మృతదేహన్ని పరిశీలించారు. అతను మంచంలో విగతజీవిగా ఉండటం, నుదుటిపై బలమైన గాయాలు, ఇంట్లో రక్తపు మరకలు ఉన్నట్లు గుర్తించారు. మృతుడి తల్లిదండ్రులు, సోదరుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఆస్తి కోసమే తల్లిదండ్రులతో కలిసి అన్నను చంపినట్లు అంజి ఒప్పుకున్నాడని ఏసీపీ తెలిపారు. అతను చెడు వ్యసనాలకు బానిసై, అప్పులు చేశాడని, తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తి విషయంలో అన్న రాజుతో కొంతకాలంగా గొడవ పడుతున్నాడని తేలిందన్నారు. అన్నను హత్య చేస్తే ఆస్తి మొత్తం తనదే అవుతుందన్న ఆలోచనతో ఇటీవలే హైదరాబాద్ నుంచి వచ్చాడని పేర్కొన్నారు. పథకం ప్రకారమే అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న రాజు తలపై కర్రతో బాది, హతమార్చాడని తెలిపారు. నిందితులను అరెస్టు చేశామన్నారు.

52 మంది ఇసుకాసురుల అరెస్ట్

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట పోలీసులు మానేరునది పరీవాహక ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న 52మంది ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులను శనివారం టౌన్ సీఐ రవి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇటీవల శంభునిపల్లిలో పట్టుకున్న ఇసుక డంపునకు రెవెన్యూ అధికారులు టెండర్ నిర్వహించారు. సదరు ఇసుకకు సంబంధించి ఏడుగురు లారీ డ్రైవర్లు, ఓనర్లపై కేసు నమోదైంది. వేలంలో రూ.50 లక్షలకు టెండర్ దక్కించుకున్న వ్యక్తి ఇసుకను హైదరాబాద్, వరంగల్, హనుమకొండ వంటి పట్టణ ప్రాంతాలకు తరలిస్తూ.. ఇసుక నిల్వలు తగ్గకుండా విలాసాగర్ గ్రామానికి చెందిన 52 మంది ట్రాక్టర్లతో మానేరు నుంచి ఇసుకను తెప్పిస్తూ డంపులో నింపుతూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఈవిషయమై పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందడంతో ఇంటెలిజెన్స్ అధికారులు దృష్టిసారించారు.